
# అవసానకాలం



ధర్మయ్య నలుగురు కొడుకులకు పెళ్ళిళ్ళు చేసి ఆస్తి పంచి ఇచ్చేశాడు. భార్య చనిపోయింది. ఒంటరి వాడయ్యాడు. తర్వాత కొడుకులు సరిగా చూడడం లేదు. కోడళ్ళు సూటిపోటు మాటలతో బాధించేవాళ్ళు. వాళ్ళ ప్రవర్తనకు బాధపడి ధర్మయ్య వేరే వుండసాగాడు. పీడా పోయిందని కొడుకులు, కోడళ్ళు సంతోషపడ్డారు.

కొన్నాళ్ళ తర్వాత ధర్మయ్యని అతని స్నేహితుడు గోపాలస్వామి కొడుకు తన ఇంటికి తీసుకెళ్ళి కన్న తండ్రిలా చూడసాగాడు.

ఇది చూసేవాళ్ళకు విడ్డూరంగా కనిపించింది. కన్న కొడుకులే ఆదరించకపోతే, స్నేహితుడి కొడుకు ఎందుకు ధర్మయ్యని పోషిస్తున్నాడో ఎవరికీ తెలియలేదు.

ఇందులో ఏదో పరమార్థం వుందని అనుమానించారు. కొందరు గోపాలస్వామిని అడిగారు. "పరాయివాడైన ధర్మయ్యని ఇంట్లో పెట్టుకుని పోషించడానికి నా కొడుకేం తెలివితక్కువవాడు కాదు. ధర్మయ్య స్థిరాస్తులు కొడుకులకు ఇచ్చినా ఇంకా అతని దగ్గర బోలెడు బంగారం వుంది. అదెక్కడో పాతిపెట్టాడు. అవసాన దశలో ఎవరు దగ్గరుంటారో వాళ్ళకి ఆ రహస్యం తప్పకుండా చెప్తాడు. అందుకే నా కొడుకు ధర్మయ్యని కన్నతండ్రిలా చూస్తున్నాడు." అని చెప్పాడు గోపాలస్వామి.

ధర్మయ్య దగ్గర చాలా బంగారం వుందనీ, అది ఎక్కడో పాతర వేశాడనీ ఆ నోటా ఆ నోటా అతని కొడుకులకు తెలిసింది.

ఇక కొడుకులు వచ్చి ధర్మయ్యని బ్రతిమాలి ఇంటికి తీసుకెళ్ళి పోటీలు పడి పోషించసాగారు.

గోపాలస్వామి ఆడిన నాటకం పుణ్యమా అని ధర్మయ్య అవసానకాలం హాయిగా గడిచి పోయింది.